క్లుప్తంగా

41 మద్యం బాటిళ్ల స్వాధీనం


జై ఆంధ్రకాలనీలో పట్టుబడిన మద్యంతో పోలీసులు

మల్కాపురం: జీవీఎంసీ 62వ వార్డు మల్కాపురం సమీపంలోని జై ఆంధ్రకాలనీలో ఓ వ్యక్తి బెల్ట్‌షాపు మద్యం విక్రయిస్తున్నట్టు సీఐ గొలగాని అప్పారావుకు సమాచారం వచ్చింది. దీంతో ఆయన శనివారం ఉదయం 7 గంటల సమయంలో ఎస్ఐ శ్రీనివాస్‌రావుతో పాటు మరి కొంత మంది సిబ్బందితో దాడి చేయించారు.ఆ ఇంట్లో సుమారు 41 మద్యం (క్వార్టర్ బాటిళ్లు) కలిగి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే బాటిళ్ల స్వాధీనం చేసుకుని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. సీఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత వారం రెండు బెల్ట్‌షాపులపై దాడులు చేసి ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయిస్తే 0891–2577392 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గుంతలు పూడ్చారు


గుంతలు పూడ్చిన అనంతరం సీసీ రోడ్డు

మల్కాపురం: ఎట్టకేలకు మల్కాపురం వద్ద శిథిలావస్థలో ఉన్న సీసీ రోడ్డుకు మోక్షం వచ్చింది. 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గంలో భూగర్భ పైపులైన్ కోసం గోతులు తవ్వారు. పని పూర్తయిన తర్వాత జీవీఎంసీ వాటర్ విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా విడిచిపెట్టడంతో గుంతలమయంగా మారింది. దీనిపై ఆయా ప్రాంత వాసులు అధికారుల ముందు పలు మార్లు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు స్పందించిన వారు శనివారం గుంతలు పూడ్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

వంటసామగ్రి అందజేత


సిబ్బందికి సామగ్రి అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీల కార్యకర్తలకు శనివారం ప్రభుత్వ విప్ గణబాబు ఇండక్షన్ స్టౌవ్, వంట పాత్రలు, ప్రీస్కూల్ పిల్లలకు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుపై ఆసక్తి కలిగించే తొలి అడుగు అంగన్‌వాడీ అన్నారు. పిల్లలకు ఆడుతూ పాడుతూ చదువు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో కె. నీలిమ, ఏసీడీపీవో సరిత, సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కిరండూల్ మార్గంలో నడిచే రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

● ఈ నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్ల రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం–పూరీ–విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం–పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన పూరీలో బయల్దేరాల్సిన పూరీ–విశాఖపట్నం(08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

ఉచిత విద్యలో వివక్ష!


ఎన్‌ఏడీ భాష్యం స్కూల్ ముందు నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

- ఫ్రీ సీటు పొందిన విద్యార్థులకు వేరే బోధన
- అందరికీ ఒకే రీతిన బోధన చేయాలని డిమాండ్
- ఎన్‌ఏడీ భాష్యం స్కూల్ ముందు తల్లిదండ్రుల నిరసన
- విచారణ చేపట్టిన విద్యాశాఖాధికారులు


వినతి పత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

విశాఖ విద్య: ఉచిత విద్య అందించే విషయంలో తమ పిల్లలపై పాఠశాల యాజమాన్యం వివక్ష చూపుతోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఏడీలోని భాష్యం స్కూల్ ప్రధాన గేటు ముందు శనివారం నిరసనకు దిగారు. విచారణకు వచ్చిన మండల విద్యాశాఖాధికారులు ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు స్కూల్లో ఫ్రీ సీటు వచ్చిందని సంబరపడి తమ పిల్లలను స్కూల్లో చేర్పించినా పుస్తకాలు, యూనీఫారాల పేరిట డబ్బులు వసూలు చేయడంతో తల్లిదండ్రులంతా కలసి పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. విద్యా హక్కు చట్టం అమలు పేరుతో ప్రైవేటు స్కూళ్లలో పేదలకు ఉచిత విద్య అందించేది ఇలాగేనా అంటూ కూటమి ప్రభుత్వాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

అసలేం జరిగిందంటే ..

గోపాలపట్నం మండలంలోని ఎన్‌ఏడీ భాష్యం స్కూల్‌లో ఆర్‌టీఈ(12.1.సీ)చట్టం అమల్లో భాగంగా ఫ్రీ సీటు పొందిన విద్యార్థుల నుంచి పుస్తకాలు, యూనీఫారాల పేరిట పాఠశాల నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా ఫ్రీ సీటు పొందిన తమ పిల్లలను వేరు చేసి, సెపరేట్ సిలబస్ బోధిస్తున్నట్టు తెలుసుకున్న వారంతా స్కూల్ నిర్వాహకులను నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తల్లిదండ్రుల కమిటీ పేరుతో అంతా కలసి రెండు రోజుల కిందట పాఠశాల ప్రిన్సిపాల్ గది ముందు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలోనే శనివారం గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి దివాకర్ పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు.

ఇదేం విచారణ

ఎంఈవో దివాకర్ ప్రిన్సిపాల్ గదిలో స్కూల్ నిర్వాహకుల సమక్షంలో ఒకరిద్దరు తల్లిదండ్రులతో మాట్లాడి వెళ్లిపోయారు. తమ పిల్లలకు జరుగుతోన్న అన్యాయాన్ని చెప్పుకుందామని తల్లిదండ్రులకు ఎంఈవోతో మాట్లాడే అవకాశం రాకపోవడంపై వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. పుస్తకాల కోసం కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని, మిగతా విద్యార్థులతో మాదిరే తమ పిల్లలకు కూడా సమాంతరంగా పాఠ్యాంశాల బోధన చేయాలని వారంతా పాఠశాల ప్రధాన గేటు ముందు నిరసన చేపట్టారు. ఇదే విషయమై పాఠశాల నిర్వాహకులకు వినతి పత్రం అందజేశారు.

ప్రైవేటుకే వత్తాసు!

ఉచిత విద్యకు తూట్లు పొడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖాధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌ఏడీ భాష్యం స్కూల్ నిర్వాహకులు సొంత సిలబస్‌తో ముద్రించిన పుస్తకాలు విక్రయించినట్లుగా తగిన ఆధారాలు చూపిస్తామని తెలిపినా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(పీఏఏపీ)వెస్ట్‌జోన్ కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రశ్నించారు.

అందరికీ ఒకేలా చదువు చెప్పాలి



మా పాప రెండో తరగతి చదువుతుంది. ఉచిత విద్య సీటు అని చెప్పి.. నాతో పుస్తకాలకు రూ.6 వేలు కట్టించుకున్నారు. ఒకటి నుంచి రెండో తరగతిలోకి వచ్చినందున ఫీజు కట్టాలని అడుగుతున్నారు. మిగతా పిల్లలకు ఒకలా, మా పిల్లలకు మరోలా పాఠాలు చెబుతున్నారు. ఇదేమని అడిగితే మీది ఉచిత సీటు కాబట్టి అంతే అని టీచరు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలి.

– ఎ. సంతోషి

ప్రభుత్వం పట్టించుకోవాలి



మా బాబుకు ఎన్‌ఏడీలోని ప్రైవేట్ స్కూల్లో ఈ ఏడాది ఒకటో తరగతి ఫ్రీ సీటు వచ్చింది. రోజూ బడికి వెళ్తున్నా ఇంకా పుస్తకాలు ఇవ్వలేదు. వాడికి పాఠాలు కూడా చెప్పడం లేదు. ఫ్రీ సీటు అని మా పిల్లలకు చదువు చెప్పరా?. ప్రభుత్వం పట్టించుకోవాలి.

– దేముళ్లు

మెగా లోక్ అదాలత్‌లో 1346 కేసుల పరిష్కారం


కక్షిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు తదితరులు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో రూ.6.97 కోట్ల విలువైన 1346 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయి. ఐదు బెంచీల్లో నిర్వహించిన శిబిరాన్ని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించారు. ఆయనతోపాటు న్యాయమూర్తులు ఎస్.కవిత, ఎం.వెంకట శేషమ్మ, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి తదితరుల సారథ్యంలో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకున్నట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఐపీసీ కేసులు 104, ఎన్ఐ యాక్టు కింద 58 కేసులు, డీవీసీ కింద 11 కేసులు, ఎస్టీసీ కేసులు 1085, అడ్మిషన్లకు సంబంధించి 26, ఎంవీవోపీలు 26 కేసులు, ఈపీ 7, ఓఎస్ కేసులు 22, ఇతర కేసులు 7 పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.యశోధర వేదమణి, డి.చిరంజీవి, సభ్యులు జె.శంకరరావు, వి.వినోద్ కుమార్, బి.వెంకటలక్ష్మి, కె.సీతామహాలక్ష్మి, వి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పల్లివీధి,గొల్లవీధి తదితర ప్రాంతాల్లోని వీధి కాలువల్లో కొన్ని రోజుల నుంచి వ్యర్థాలు నిలిచిపోయాయి. దీనిపై ఆయా కాలనీ వాసులు వార్డు శానిటరీ అధికారికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన సిబ్బంది సాయంతో శనివారం ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు.

ఏఐతో భవిష్యత్తులో అద్భుతాలు


సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

మల్కాపురం: కృత్రిమ మేధస్సు(ఏఐ) భవిష్యత్తులో అద్భుతాలు సృష్టించనుందని సౌదీ అరేబియాలోని బజాన్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్‌కుమార్ మసిహ్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో 'మానవ, కృత్రిమ మేధస్సుల విప్లవాత్మక సహకారం' అనే అంశంపై శనివారం ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా ఆయన మాట్లాడుతూ మానవ మేధస్సుతో కలిసి కృత్రిమ మేధస్సుతో రాబోయే కాలంలో వివిధ వృత్తుల్లో పనితీరును మెరుగుపరుస్తుందని వివరించారు. అతి తక్కువ సమయంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోడానికి ఉపయోగపడుతుందని, మానవ తప్పిదాలను తగ్గిస్తుందన్నారు. ముఖ్యంగా వైద్య రంగంలో రోగం నిర్ధారణలో, ఆరోగ్య నివేదికల విశేషణలో, క్యాన్సర్ వంటి జబ్బుల ముందస్తు హెచ్చరికల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు గ్లోరియా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి, కరస్పాండెంట్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్యాస్లిన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు పరిశుభ్రం


బుచ్చిరాజుపాలెంలో డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు (ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..


వ్యర్థాలు తొలగించిన తర్వాత ఇలా

విశాఖ విద్య: డ్రైనేజీల పరిశుభ్రతపై ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. 'వ్యాధుల కాలం..అప్రమత్తత శూన్యం' అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

మెడికల్ షాప్‌లో నిషేధిత మందుల స్వాధీనం


సాయి తేజస్విని మెడికల్ షాప్‌లో తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలోని సాయి తేజస్విని మెడికల్ షాప్‌లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే మందులు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. వీరు ఇక్కడ డెకాయ్ ఆపరేషన్ చేసి మత్తు మందులు అమ్ముతున్నట్లుగా నిర్ధారించారు. దుకాణంలో ఉన్న మందులను స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్ చేశారు. మెడికల్ షాప్ లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. వైద్యుల చీటీ లేకుండా మత్తు కలిగించే మందులు, మాత్రలు, ఇంజక్షన్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గతంలో పలుమార్లు దొరికినా..

గతంలో సాయి తేజస్విని మెడికల్ షాప్‌లో నిషేధిత మందులు, మత్తు కలిగించే మందులు అమ్ముతున్నట్లు తెలిసి పలుమార్లు దాడులు చేశారు. నిర్వాహకులు జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయినా వారి తీరు మారలేదు. ఇలాంటి మందులను ఎక్కువ ధరకు అమ్మవచ్చని, అక్రమార్జనే పరమావధిగా వ్యాపారం చేస్తుంటాడని ఈ విషయం తెలిసిన వారు చెప్పుకుంటున్నారు.

ప్రజలకు అందుబాటులో ఆస్పత్రి సేవలుండాలి


సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి ఫీజులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. కమిషనర్ చాంబర్‌లో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ప్రతినిధులతో శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రిని సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరిచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విషయమై విధి విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీతో కోరమండల్ ఫెర్టిలైజర్స్, ఏఎంజీ ఫౌండేషన్ ఆస్పత్రిని నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి సంబంధించిన అంశంపై గతంలో కౌన్సిల్లో చర్చించామని, దానికి అనుగుణంగా ప్రజలకు ఎఫ్ఆర్‌యూ సెంటర్ లీజు అగ్రిమెంట్, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఫీజుల వసూలు, మెరుగైన వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించినట్లు కమిషనర్ తెలిపారు.

ఎన్‌ఏడీ అధికారిపై దాడి.. నలుగురి అరెస్ట్

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


దాడి అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్లిపోతున్న నిందితులు(సీసీ టీవీ ఫుటేజీ)


ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్‌ఏడీ) అధికారిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న నేవల్ ఆర్మమెంట్ డిపో డీజీఎం మల్లికార్జునరావుపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఎన్‌ఏడీలో విధులను ముగించుకుని భోజన విరామ సమయంలో క్వార్టర్స్‌లో ఉన్న తన ఇంటికి వస్తుండగా.. కేంద్రీయ విద్యాలయం వద్ద రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని ఆపి ఆయనపై దాడి చేశారు. విచక్షణారహితంగా పిడిగుద్దులు కురిపించారు. ఆయన హెల్మెట్ ధరించి ఉండటంతో తలపైనా, ముఖంపైనా దెబ్బలు తగల్లేదు. దాడికి పాల్పడిన వారిలో ఎన్‌ఏడీ ఉద్యోగి ఒకరు ఉండటంతో, కక్షపూరితంగానే దాడి చేశారని తెలుస్తోంది. మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటి వరకు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎన్‌ఏడీలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టడం వంటి ఏకపక్ష నిర్ణయాల వల్ల ఇబ్బంది పడుతున్నామనే కక్షతోనే దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. దాడికి పాల్పడిన ఎన్‌ఏడీ ఉద్యోగి బెహరా అరుణ్‌తో పాటు ఎల్లవిల్లి దినేష్ కుమార్, చిత్ర గణేష్ కుమార్, నడిపిల్లి నితేష్ కుమార్‌లను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరుణ్ కుమార్‌కు ఈ ముగ్గురు స్నేహితులు. అయితే అరుణ్ కుమార్ సుపారీ గ్యాంగ్‌తో కలిసి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దాడిలో ఒక సీఈ యూనియన్ హస్తం ఉందని కార్మికులు, ఇతర యూనియన్లు చెప్పుకుంటున్నాయి.

ఐఎన్‌టీయూసీ నిరసన

ఎన్‌ఏడీ అధికారి దాడి ఘటనపై ఐఎన్‌టీయూసీ సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, థర్డ్ లెవెల్ జేసీఎం సభ్యుడు సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్‌ఏడీ యూనియన్ నాయకులు సుపారీ గ్యాంగ్‌తో అధికారిపై దాడి చేయించారని ఆరోపించారు. హత్యాయత్నం చేయడంతో కార్మికులు భయాందోళన చెందుతున్నారన్నారు. కార్మిక సంఘాల నాయకులు కార్మిక చట్టాలను అనుసరించి పోరాటాలు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకురావాలే తప్ప, దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. నిరసనలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన సెయిలింగ్ శిక్షణ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం, తీర గస్తీ దళం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన ఓసియన్ సెయిలింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 23 నుంచి భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సర్కార్‌లోని వాటర్ మెన్ షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కి చెందిన 13 మంది సెయిలర్స్ ఈ శిక్షణలో పాల్గొన్నారు. సముద్ర జలాల్లో ఆపత్కాల సమయంలోనూ, విపత్తుల్లో చిక్కుకున్న వారికి రక్షించేలా తర్ఫీదునిచ్చారు. దీంతో పాటుగా సుదీర్ఘ సముద్రయానానికి సిద్ధమయ్యేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసంతో పాటు మెళకువలు నేర్పించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కోస్ట్ గార్డ్ గోల్డెన్ జూబ్లీ మహా సముద్రయానానికి శిక్షణ తీసుకున్న వారిని సంసిద్ధులను చేసినట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

తుది విడత చందనం అరగదీత ప్రారంభం



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం నుంచి తుదివిడత చందనం అరగదీత కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీన ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించనున్న మూడు మణుగుల (సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సిద్ధం చేసేందుకు ఈ అరగదీత చేపట్టారు. ఉదయం చందనం చెక్కలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం 15 మంది నాలుగో తరగతి సిబ్బంది 36 కిలోల చందనాన్ని అరగదీశారు.

ఆర్థిక ప్రణాళికలపై నేవీ ఉద్యోగులకు అవగాహన

సాక్షి, విశాఖపట్నం: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుపోకుండా ప్రతి ఒక్కరూ పాటించాలని పొదుపు మంత్రం తూర్పు నౌకాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా సూచించారు. రక్షణ దళం –ఆర్థిక అక్షరాస్యత పేరుతో ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలోని సాముద్రిక ఆడిటోరియంలో శనివారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సెషన్‌కి నేవీ అధికారులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బుని ఏ విధంగా ఆదా చేయాలి. ఎలా దాన్ని రెట్టింపు చేసుకోవాలనే అంశాలపై విశ్రాంత సబ్ లెఫ్టినెంట్ దేబరత నందా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ దివాడ్కర్ వివరించారు.

అక్రమ నిర్మాణం తొలగింపు


యల్లబిల్లివారి వీధిలో ఇంటి డెకింగ్‌ను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధి పాత రామారావు హాస్పిటల్ పక్కన ఓ ఇంటి యజమాని అక్రమ నిర్మాణం చేపట్టాడు. కూటమి నాయకుల అండదండలతో కంచరపాలెం ముత్యమాంబ ఆలయం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మెయిన్ రోడ్డును పూర్తిగా ఆక్రమించి శ్లాబ్ వేసేందుకు డెకింగ్ ఏర్పాటు చేసి పనులు చేపట్టాడు. స్థానికుల ఫిర్యాదులతో శనివారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శి చైతన్య, జోన్–5 టౌన్ ప్లానింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆక్రమించిన ముందు భాగాన్ని, డెకింగ్‌ను తొలగించారు.